ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియాకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు-2024 లభించింది. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా కలెక్టర్ ఈ అవార్డు అందుకున్నారు. అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు నిర్వహించే వినూత్న కార్యక్రమాలు, ఓటర్లను జాగృతం చేయడం వంటి అంశాలల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు కలెక్టర్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. అదేవిధంగా ఉత్తమ పనితీరు కనపరిచిన ఒంగోలు ఆర్‌డిఒ కె.లక్ష్మీ ప్రసన్న, ▶ 2లో



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

27వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు ▶ 5లో



అవార్డు అందుకుంటున్న ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్

ఐటీకోర్ ఎస్ఐకు అవార్డు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గత సార్వత్రిక ఎన్నికలలో జిల్లాలో సమర్థవంతంగా ఎన్నికల ప్రక్రియ జరిగేందుకు అప్పటి ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశాలతో సమర్థ యాప్ రూపొందించిన బాపట్ల జిల్లా ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్ ఎక్సలెన్స్ ఇన్ ఎలక్టోరల్ రోల్ మేనేజ్మెంట్ అవార్డు అందుకున్నారు. విజయవాడలో శనివారం నిర్వహించిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ సమక్షంలో రాష్ట్ర సిఎస్. కె.విజయానంద్ చేతుల మీదుగా నాయన్ రసూల్ ఈ అవార్డు అందుకున్నారు. పురస్కారంలో భాగంగా రూ.15 వేల నగదు, మెమోంటో, ప్రశంసా పత్రం అందజేశారు. అవార్డు అందుకున్న ఐటి కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్‌ను జిలా ఎస్‌పి తుషార్ దూడిఅభినందించారు.

సమానత్వ సాధనకు

మహిళలు ఐక్యంగా ఉద్యమించాలి

బెతూన్ నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ ఉదయిని

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ



ఐద్వా డైరీని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉదయిని

ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వ సాధన కోసం మహిళలు ఐక్యంగా ఉద్యమిం చాలని బెతూన్ నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ ఉదయిని పిలుపునిచ్చారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా రాష్ట్ర కమిటీ ముద్రించిన 2025 డైరీని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉదయిని మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం స్పందిస్తూ, అన్యాయాలు, అవమానాలకు గురువుతున్న మహిళలకు ఐద్వా కార్యకర్తలు అండగా నిలవాలన్నారు. సేవా కార్యక్రమాలను విస్తతం చేయాలని సూచించారు . శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఆధునికత అత్యంత వేగంగా పెరుగుతున్న సమాజంలో ఇంకా సనాతన భావాలు కొనసాగటం విచారకరమన్నారు. ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెంచేందుకు కార్యకర్తలు మరింత కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కళ్యాణి, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి,ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులు బి. గోవిందమ్మ, జి. ఆదిలక్ష్మి, నాయకులు ఎస్‌కె.నాగూర్, బి.భావన, రాజ్యలక్ష్మి, కె.రాజేశ్వరి, బి.పెద్ద గోవిందమ్మ, ఎస్. ఇంద్ర జ్యోతి పాల్గొన్నారు.

పాఠశాలల పునర్విభజన ప్రక్రియ వేగవంతం

జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



పాఠశాలలో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రభుత్వ పాఠశాలల పునర్విభజన ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పున్ణనిర్మాణం, పునర్విభజన ప్రక్రియలో భాగంగా నుంచి బాపట్ల సూర్యలంక వెళ్లే రహదారిలోని సరస్వతి స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను హాజరును పరిశీలించారు. ఆన్‌లైన్ లో నిక్షిప్తం చేసిన విద్యార్థుల హాజరు, తరగతి గదుల్లో విద్యార్థుల హాజరును పరిశీలిం చారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యా యులతో సమావేశం నిర్వహించారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రతి త్రైమాసంలో 48 పిరియడ్లు విద్యాబోధన చేయాలనే నిబంధనలను ఉపాధ్యాయులు విధిగా పాటించాలన్నారు. ప్రభుత్వ విధానాలను ఉల్లంఘించరాదన్నారు. సిలబస్ పూర్తయిందా లేదా, స్లిప్ టెస్టులు తదితర పరీక్షల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇదే ప్రాంగణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆరుబయట భోజనం చేస్తున్న విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. మధ్యాహ్న భోజనం రుచిగా ఉందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డిఇఒ పురుషోత్తం, ఆర్‌డిఒ పి. గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహశీల్దారు సలీమా తదితరులు ఉన్నారు.

జిల్లా కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

దర్శి తహశీల్దారు ఎం.శ్రావణ్ కుమార్‌కు అవార్డులు లభించాయి. అవార్డు గ్రహీతలను సిఎస్ విజయానంద్, మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్, జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరరావు అభినం దించారు.

చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : ఎన్‌టిఆర్ కళాపరిషత్ నాటకోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు శనివారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. .సబ్ జూనియర్ , జూనియర్స్, సీనియర్స్ , సూపర్ సీనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-చీరాల

గుండె పోటుతో మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు కొల్లిమర్ల సాంబశివరావు కుటుంబానికి చీరాల ఎన్ఆర్ అండ్ పిఎం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.26 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తిలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సాంబశివరావు మృతి ఎంతో బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ, సెక్రటరీ చారగుళ్ళ గురుప్రసాద్, డాక్టర్ మద్దాల వెంకట రమణారావు, గుర్రం బదరీనాథ్, దోగుపర్తి వెంకట సురేష్, చింతా రమేష్, గుద్దంటి రమేష్ బాబు, కొమ్మూరి వీరాంజనేయులు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో

బాపట్ల జిల్లాకు 4వ స్థానం

ప్రజాశక్తి-బాపట్ల



అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారత సైన్స్ ఫేర్ లో బాపట్ల జిల్లా విద్యార్థులు 4వ స్థానం సాధించినట్లు డీఈవో ఎస్. పురుషోత్తం తెలిపారు. సమూహ విభాగంలో బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు సిహెచ్ సాయిరామ్ ధీరజ్, కె.వెంకటేష్ రూపొందించిన ప్రాజెక్ట్ "మల్టీ పర్పస్ అగ్రి కల్చర్ మెషిన్" ప్రాజెక్ట్ 4వ స్థానంలో నిలిచిందన్నారు. పుదుచ్చేరి విద్యా శాఖ మంత్రి నమశివాయ, అసెంబ్లీ స్పీకర్ సెల్వంలు విద్యార్థులు అవార్డు పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను, గైడ్ టీచర్ కె.మోహనాంజలి, హెచ్ఎంలను డీఈవో పురుషోత్తం, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, ఉప విద్యాశాఖ అధికారులు జి.వెంకటేశ్వర్లు, ఏ.శ్రీనివాసరావు అభినందించారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-నగరం

శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ (మెన్) టోర్నమెంట్లో వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల ప్రథమ స్థానం, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల బాపట్ల ద్వితీయ స్థానం, ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కళాశాల తృతీయ స్థానం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నాలుగో స్థానం సాధించాయి. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి, పరిటాల యూత్ దండమూడి ధరణి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సెలక్షన్స్ అబ్జర్వర్ డాక్టర్ డి.సూర్యనారాయణ, యూనివర్సిటీ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎన్.శేషగిరి, డాక్టర్ ప్రీతంలు యూనివర్సిటీ జట్టును సెలెక్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎకడమిక్ డైరెక్టర్ డైరెక్టర్ వి.వెంకటేశ్వరరావు, డాక్టర్ పి.శ్రీనివాసరావు, ప్రసన్న బాబు, పి.వెంకటనారాయణ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వి.సాంబమూర్తి, కళాశాల సూపరింటెండెంట్ పి.అమరేష్ పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అర్హులైన యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ప్రతి ఒక్క ఓటరూ తన హక్కు వినియోగించుకోవాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఓటింగే అతి పెద్ద పండుగ అని తెలిపారు. ఓటర్లందరూ నిష్పక్షపాతంగా తమ హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో పోలింగ్ శాతం పరంగా ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సంయుక్త కలెక్టర్ సన్మానిందారు. తొలిసారి ఓటర్లుగా నమోదైన వారికి గుర్తింపు కార్డులను అందించారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలపడేలా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని ఈ సందర్భంగా సంయుక్త కలెక్టరు ప్రతిజ్ఞ చేయించారు. తొలుత డిల్లీ నుంచి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఇచ్చిన సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా కార్యక్రమంలో పాల్గొన్న వారు వీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ బి. చిన ఓబులేసు, డిపిఒ జి.వెంకట నాయుడు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారధి, డిఆర్‌డిఎ, మెప్మా పీడీ టి. రవి కుమార్, ఆర్ఐఒ సైమన్ విక్టర్, డిఇఒ కిరణ్ కుమార్, ఒంగోలు కమిషనర్ వెంకటేశ్వర రావు, ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎం. నాగేశ్వర రావు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అద్దంకి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరులో ఫిబ్రవరి నెల 1 నుంచి జరుగనున్న మహాసభలను జయప్రదం చేయాలని జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. సిపిఎం అద్దంకి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య భవనంలో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తంగిరాల వెంకటేశ్వర్లు, పట్టణ కమిటీ సభ్యులు కె.రఘు చంద్ మాట్లాడుతూ ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చలతో పాటు రైతు, కార్మిక, కర్షక ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయడం కోసం రాష్ట్రంలో కీలకమైన ఉద్యోగ ఉపాధ్యాయ ఉపాధి అంశాలపైన ఈ మహాసభలో చర్చించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తు పోరాటాలని నిర్వహించేందుకు మహాసభల్లో తీర్మానాలు చేయడం జరుగుతుందని ప్రజలందరూ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు డి.గంగాధర్, టి.రాజు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు తెలియకుండా ఇళ్లు రద్దు చేశారు

మండల సమావేశంలో సర్పంచ్ ధ్వజం



మాట్లాడుతున్న ఎంపీపీ అంకమ్మరెడ్డి

ప్రజాశక్తి-చిన్నగంజాం

శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కొత్తపాలెం పంచాయతీలో ఏకంగా 53 గృహ నిర్మాణాలను లబ్ధిదారులకు తెలియకుండానే రద్దు చేశారని ఏఈ రాజశేఖర్‌ను నిలదీశారు. ఈ విషయంపై మరోసారి పరిశీలించాలని కోరారు. అనుమతులు లేకుండానే స్కూల్ నిర్మాణం చేపట్టడమేమిటని ఎంఈవో అజయ్ బాబును ప్రశ్నించారు. తమ గ్రామంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టడం లేదని ఏపీవో నాగలక్ష్మిని పలువురు నిలదీశారు. గిరిజన విద్యార్థులకు ఆధార్ కార్డులు పూర్తిగా అందజేసేందుకు అవగాహన కల్పించాలని సిడిపిఓ టీ.ఝాన్సీని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, తహశీల్దార్ జివిగుంట ప్రభాకర్ రావు, పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, ఎలక్ట్రికల్ ఏఈ గణ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపతిరావు

పోలీసుల పల్లె నిద్ర

ప్రజాశక్తి - నిజాంపట్నం : నిజాంపట్నం ఎస్ఐ కె.తిరుపతిరావు శుక్రవారం రాత్రి మండల కేంద్రమైన నిజాంపట్నంలోని జల్సా బజార్ రామాలయం వద్ద పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు.

28న అన్నదానం

ప్రజాశక్తి-బట్టిప్రోలు

భట్టిప్రోలులో ప్రముఖ చేనేత వస్త్ర వ్యాపారి, కీర్తిశేషులు పాలకుర్తి సీతారామయ్య 31వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన జ్ఞాపకార్థం ఈనెల 28వ తేదీన పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలికి చెందిన సీతారామయ్య అల్లుడు ప్రముఖ ఆడిటర్ కీర్తిశేషులు మానేపల్లి నరసింహారావు, కుమార్తె మానేపల్లి లక్ష్మీ సరోజినిల సౌజన్యంతో మంగళవారం అన్నదానం, విద్యార్థులకు స్టేషనరీ వస్తువుల పంపిణీ కార్యక్రమం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

ప్రజాశక్తి-కొల్లూరు : ఆటో బోల్తా పడటంతో వ్యక్తికి గాయాలైన సంఘటన కొల్లూరు మండలంలోని చంపాడులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పితా సురేష్ చంపాడు నుండి ఈపూరు గ్రామానికి ఆటోలో వెళుతుండగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. అటువైపు వెళుతున్న వాహనదారులు గుర్తించి 108కి ఫోన్ చేయగా సిబ్బంది వైద్యశాలకు తరలించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-పుల్లలచెరువు: పుల్లలచెరువు నుంచి రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం తెలియడంతో ఎన్‌ఫోర్సుమెంట్ డిటి రాధాకృష్ణ, పుల్లలచెరువు ఎస్ఐ సంపత్‌కుమార్ శనివారం దాడి చేశారు. పుల్లలచెరువులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఇసుక త్రిపురవరానికి చెందిన పార్శపు వెంకట నారాయణ అనే వ్యక్తి ఆధీనంలో ఆటోలో లోడ్ చేసి ఉన్న 670 కేజీల రేషన్ బియ్యాన్ని ఆటోతో సహా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి-బాపట్ల: పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎఈవో ఎస్.నిరంజన్ అన్నారు. శనివారం పట్టణంలో ఉప్పరపాలెం ప్రాథమిక పాఠశాల మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించిన ఏపీ ఎన్జీవో జిల్లా కోశాధికారి పానకాల రాయుడును అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.వి.సాంబశివరావు, ఉపాధ్యాయులు ఎస్‌కే.రఫీ, జి.ప్రసాదరావు, పి.శ్రీమన్నారాయణ, ఎస్ఎంసి చైర్మన్ అరుణ, సీఆర్పీ రవి కిరణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు సహకరించాలి

ప్రజాశక్తి-బాపట్ల: దోమల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని జిల్లా మలేరియా అధికారి గోపీనాథ్ అన్నారు. శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పనుల్లో భాగంగా కాలువ పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాల పరిసరాల్లో, గృహ సముదాయాల్లో ఉన్న నీటి నిల్వల్లో పొంచి ఉన్న లార్వా నిర్మూలన ద్రావణంతో శుభ్రం చేయించాలన్నారు.

మొక్కలు నాటిన సిఐ రాంబాబు

ప్రజాశక్తి-బాపట్ల: పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా పట్టణం పోలీస్ స్టేషన్ ఎదురు సిఐ రాంబాబు మొక్కలు నాటారు. ఇప్పటివరకు అక్కడ ఉన్న విష వాయువులు వెదజల్లే చెట్లను తొలగించారు. పోలీస్ సిబ్బంది కొబ్బరి చెట్లను పోలి ఉండే క్రోటాన్స్ చెట్లను నాటారు.

పొగాకు పంట పరిశీలన

ప్రజాశక్తి-ముండ్లమూరు: సూపర్ చెక్‌లో భాగంగా మండలంలోని వేంపాడులో తహశీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ శనివారం పరిశీలించారు. మండలంలోని ఆర్.ఎస్.కెలో పనిచేస్తున్న విఏఏ రైతుల పంట పొలాలను పరిశీలించి రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేశారు. ఈ-క్రాప్ నమోదు చేసిన పంటలు, సాగు చేసిన పంటలు సరిగా ఉన్నాయో లేవో చెక్ చేశారు. తహశీల్దార్ వెంట వీఆర్వో తేజ, సచివాలయ సిబ్బంది, విఏఏ పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-వేటపాలెం: పశుపోషకులను ప్రోత్సహించే విధంగా గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పందిళ్ళపల్లి పశువైద్యాధికారి గుత్తి పుష్పలత తెలిపారు. శనివారం మండల పరిధిలోని అక్కయ్యపాలెం పంచాయతీలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గేదెలకు, దూడలకు, కోళ్లకు డివార్మింగ్ మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ ఏ.కృష్ణాంజనేయులు, పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి రాజకీయ ప్రస్థానం

- గ్రామాల్లో సామాన్య ప్రజానీకంతో మమేకం
- పేద సామాజిక వర్గాల్లో అంతరాల్లేని నేతగా ముద్ర
- 20వ దశకంలో వరుసగా మూడుసార్లు గెలుపు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఓరోజు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వద్దకు దళిత సామాజికవర్గాలకు చెందిన ఇద్దరు సర్పంచులు ఆయా గ్రామాలకు చెందిన నాయకులతో కలిసి వచ్చి నిలుచున్నారు. వెంటనే పక్కనే ఉన్న కుర్చీల్లో కూర్చోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వారికి మర్యాద పూర్వకంగా సూచించారు. అయినా ఆ సర్పంచులు నిలుచునే ఉన్నారు. గ్రామ నాయకుల మొఖం వైపు చూస్తూ కూర్చోవడానికి వెనుకాముందూ ఆడుతుంటే వారిని బలవంతంగా ఎమ్మెల్యే సాంబశివరావు తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. నియోజకవర్గంలో ఉన్న కొన్ని పరిస్థితులను ఆయన ఒకరోజు ముచ్చటిస్తూ ప్రస్తావించిన అంశాల్లో ఇవి పైకి సాధారణ మాటలుగా ఉన్నా ఎంతో ఆలోచింపదగ్గ సామాజిక కోణం ఉన్న అంశాలు. ఇప్పటి వరకూ అక్కడ ఉన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఎలా ఉన్నాయి? అన్నది సుస్పష్టం. ఇలాంటి రుగ్మతలు. సనాతన పద్ధతులకు స్వస్తి పలకాలనే భావనతోపాటు వాటిని రూపుమాపాలనే ఆలోచనతో ఆధునిక రాజకీయ యుగంలో మనుషులంతా సమానులే అన్న తలంపుతో రాజకీయ ప్రస్థానం కొనసాగిస్తున్నారు ఎమ్మెల్యే సాంబశివరావు. గతంలో గెలిచిన ఎమ్మెల్యేలకు భిన్నంగా అందరిలో ఒకరిగా నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమమే ఎజండాగా సాగుతోన్న ఆయనకు సామాన్య ప్రజానీకం నుంచే మంచి ఆదరణ వచ్చింది. దళిత పేద సామాజికవర్గాల్లోనూ చెరగని ముద్ర వేసుకున్నారు. గతంలో ఆ నియోజకవర్గంలో రాజకీయ నేతల వద్ద నిలుచునే సంస్కృతి ఉంది. ఇపుడు అది కనుమరుగవుతోంది. ఇలాంటి పంథాలో వెళ్లడం వల్లనే ఏలూరి వరుసగా మూడుసార్లు గెలిచారన్నది మేధావుల విశ్లేషణ.

వ్యవసాయ కుంటుం నుంచి ...


వాస్తవానికి పర్చూరు నియోజకవర్గంలో రాజకీయ నేతలందరూ ధనిక రైతు కుటుంబాల నుంచే ఇప్పటి వరకూ ఉన్నారు. ఆరంభంలో కమ్యూనిస్టుపార్టీ నుంచి గెలిచిన నేతలు మినహాయిస్తే ఇప్పటి వరకూ కాంగ్రెస్, తెలుగుదేశం నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు అందరూ ఏదో ఒక రాజకీయ నేపథ్యంతో పాటు బలమైన ధనిక రైతు లేదా భూస్వామ్య కుటుంబాలనుంచి వచ్చిన వారే. నియోజకవర్గంలో 20వ దశకం వరకూ ఇదే ధోరణి కొన సాగింది. 2014 నుంచి ఇప్పటి వరకూ వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఏలూరి సాంబశివరావు నేపథ్యం మాత్రం ప్రత్యేకంగా ఉంది. ఆయన ఓసామాన్య రైతు కుంటుంబం నుంచి వచ్చారు. ఉద్యానవనశాఖలో ఉద్యోగిగా ప్రస్థానం మొదలు పెట్టారు. రైతుల పట్ల, రైతు కూలీలుగా ఉండే దళితుల పట్ల ఆయనకు ఉన్న శ్రద్ధే రాజకీయాల వైపు వచ్చేలా చేసింది. చిన్నపుడు అన్ని కష్టాలూ చూశారు. గ్రామాల్లో ఉండే అన్ని పరిస్థితులూ ఆయనకు తెలుసు. రైతు కుటుంబంలో పుట్టిన ఆయనకు ఏది కష్టం ఏది సుఖం అనే తేడా స్పష్టంగా తెలిసిందే.



ఎమ్మెల్యే ఏలూరి

వ్యాపారాలు వదిలేసి రాజకీయాల్లోకి..

ఏలూరికి రైతుల ఉత్పత్తులకు సంబంధించిన ఆగ్రో వ్యాపారాలూ ఉన్నాయి. వాటిని వదిలేసి రాజకీయాల వైపు వచ్చారు. రైతులకు, రైతు కూలీలకు మరింత సేవ చేయాలనే ఆలోచనతోనే వచ్చారు. హఠాత్తుగా రాజకీయ పార్టీ టిక్కెట్ తెచ్చుకుని ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2014కు ముందు ఆయన నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలతో అడుగుపెట్టారు. వృద్ధులకు పేదలకు కంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. కంటి ఆపరేషన్లు వేలాది మందికి చేయించారు. ట్రస్టుతో సొంత నిధులు వెచ్చించి సేవ ప్రారంభించారు. అప్పుడే పేదల్లోనూ, వృద్ధుల్లోనూ మంచి ఆదరణ తెచ్చుకున్నారు. రైతులకూ మేలు చేయాలనే ఆలోచనతో వారికి వ్యవసాయంలో సూచనలు సలహాలు ఇచ్చేవారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామం తిరిగి ఎవరికి ఏమి కావాలనేది అధ్యయనం చేశారు. సహజవనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఇక్కడున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపితే అందరికీ మేలు జరుగుతుందని భావించారు. రైతులకు సంబంధించి సాగునీరు, వరదనీటి సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధరలు, మార్కెటింగ్ అవకాశాలు కీలకమని భావించారు. తరతరాలుగా అణగదొక్కబడిన సామాజికవర్గాలను పైకి తేవాలనే ఆశయంతో



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

దళితవాడల్లోనూ నడిచారు. ఇప్పటి వరకూ ఓట్లు సమయాల్లోనే దళిత వాడల్లో నేతలు తిరిగారు. అందుకు భిన్నంగా ఏలూరి ముందుగానే పర్యటించారు. స్పష్టమైన ఎజెండాతో 2014 ఎన్నికల్లో పోటీచేసి తొలిసారిగా గెలిచారు. అధికారంలో ఉన్నందున అవకాశం ఉన్నమేరకు అభివృద్ధి చేశారు. ఇందులో మిగతా నియోజకవర్గాలతో పోలిస్తే తారతమ్యాలు ఉండొచ్చు. అయితే ఎమ్మెల్యేగా అన్ని వర్గాలకు దగ్గరగా ఎలా ఉండాలో నిరూపించారు. మొదటిసారి గెలిచినపుడే మంచి వ్యక్తిగా మంచి నేతగా వివాద రహితుడిగా పేరు తెచ్చుకున్నారు. ఓటర్లలో ఇదే ముద్రపడింది. ఎవరు వెళ్లినా మార్టూరు సమీపంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదగా చూస్తారనే చర్చ ఉంది. ఆధునిక రాజకీయవ్యవహార శైలిలో గ్రామస్థాయి నేతలు, పార్టీ క్యాడర్‌ను అన్ని విధాలా ఆదరించారు. జాగత్తగా చూసుకున్నారనే చర్చ ఉంది. ఎవరు ఏ సమస్యపై వచ్చినా వారికి స్వాంతన కలిగేలా క్యాంపు కార్యాలయాన్ని తీర్చిదిద్దారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు అన్నివర్గాలకూ అదే ప్రాధాన్యత ఇచ్చారనే విశ్లేషణ కూడా ఉంది. ఆయన స్వభావం ముఖ్యంగా గతంలో గెలిచిన నేతలకు భిన్నంగా సామాన్యులు ఆదరించేలా ఉందనే చర్చ రావడం విశేషం. ఆయన తత్వమే వరుసగా మూడు సార్లు గెలిచేలా చేసింది. 2019లో జగన్ గాలిలోనూ పర్చూరులో తిరిగి తెలుగుదేశం నుంచి గెలిచారు. అందుకు ఆయన అప్పటి వరకూ నియోజవర్గంలో అన్ని కోణాల్లో చేసిన కృషే కీలకంగా పని చేసింది. 2024లోనూ మళ్లీ భారీ మెజార్టీతో గెలిచారు. 20 దశకంలో వరుసగా మూడు సార్లు గెలిచారు. ఇందులో కీలకమైన విషమేమింటే నియోజకవర్గంలో ధనిక రైతు కుటుంబం నుంచి వచ్చి ఎన్‌టిఆర్ అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావుపైనే రెండోసారి 2019లో గెలిచారు. దగ్గుబాటికి కీలక పదవి ఇచ్చి చంద్రబాబును ఇబ్బంది పెట్టాలనే జగన్ వ్యూహానికి ఇక్కడే ఏలూరి బ్రేక్ వేశారనే చర్చ నడిచింది. ఎన్‌టిఆర్ అల్లుడిగానే దగ్గుబాటికి నియోజకవర్గంలో రాజకీయంగా గుర్తింపు తోపాటు గెలుపులు, పదవులు దక్కాయి. ఇందులో సందేహం లేదు. 1983 నుంచి 1989 వరకూ మూడు సార్లు దగ్గుబాటి గెలిచారు. తర్వాత రాజకీయ మార్పుల్లో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. 2004, 09లో వరుసగా రెండు సార్లు కాంగ్రెస్ నుంచి దగ్గుబాటి గెలిచారు. 2019లో వైసిపి నుంచి పోటీచేసి ఏలూరి సాంబశివరావుపై ఓడిపోయాక రాజకీయాలకు దూరంగా ఉన్నారాయన. ఇలా పర్చూరు నియోజకవర్గంలో మళ్లీ తెలుగుదేశం పార్టీ జండాను నిలబెట్టడంలో ఏలూరి సాంబశివరావు కీలకపాత్ర పోషించారు. ఇక్కడ తిరుగులేని నేతగా ఎదిగారు.

అవాంతరాలు అధిగమించి.. కుట్రలు ఛేదించి..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనూ, తర్వాత టీడీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా క్రియాశీలకంగా పనిచేశారు. అధికారం ఉన్నా లేకున్నా బెదరకుండా నిలబడ్డారు. ఒత్తిళ్లుతట్టుకున్నారు. ప్రతిపక్షంలో ఉంటే ఎలా ఉంటుందో ఎలా ఉండాలో చూశారు. రాజకీయంగా అనేక అవాంతరాలను అధిగమించారు. కుట్రలను ఛేధించారు. ఓటర్లను తొలగించి ఓడించాలనే ప్రత్యర్థిపార్టీ వ్యూహాలను తిప్పికొట్టారు. న్యాయపోరాటం చేశారు. ఓ రాజకీయ నేతగా ఎన్ని చూడాలో అన్నీ చూశారు. చంద్రబాబు మదిలో పార్టీకోసం పనిచేసే కీలక బృందంలో ఏలూరికి ప్రత్యేక స్థానం ఉంది. ఉమ్మడి ప్రకాశం నేతలతో సమన్వయం, సఖ్యతగా కొనసాగారు. రాజకీయంగా పార్టీలో ఒడిదుడుకులు వచ్చిన సమయాల్లోనూ, సంక్లిష్టమైన సందర్భాల్లోనూ ఆయన తనదైన శైలిలోనే ముందుకు సాగారు. పార్టీకే ప్రాధాన్యత ఇచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ క్యాడర్‌కు అండగా వెన్నుదన్నుగా నిలిచారు. ఆయనపై ఎవరు పోటీచేసినా ఓడిపోతారనే చర్చ ఎన్నికలకు ముందు నుంచే వచ్చింది. అందుకే వైసిపి కూడా పర్చూరులో ఇన్‌ఛార్జులను తరుచూ మార్చాల్సి వచ్చింది. ఎన్ని చేసినా ఫలితం లేదు. ఆయన మంచి తనం.. సున్నితమైన మనస్వత్వం.. మంచివారనే ముద్ర వరుసగా మూడుసార్లు గెలిచేలా చేసింది. మంత్రిగా ఉండేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఆయన కన్నా సీనియర్‌గా ఉన్న గొట్టిపాటిని చంద్రబాబు క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. దీన్ని కూడా పాజిటివ్‌గా తీసుకున్నారు.అదే ఆయన భవిష్యత్ రాజకీయ ప్రస్థానానికి మంచి బాట వేయనుంది.



జాబ్‌మేళా ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

క్రమశిక్షణ పట్టుదల కఠోర శ్రమతో అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చు అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ హెచ్ఆర్ కో సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించారు. జాబ్ ఫెయిర్‌కు 500 మంది యువతీ యువకులు హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఇంటర్వ్యూలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క యువతీ యువకులకు రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు ఉందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు యువత చేతిలో ఉందని, యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పర్చూరు నియోజకవర్గంలో యువతి యువకులు కష్టపడే చదివేతత్వం ఉన్నా ఉపాధి లేని నిరుద్యోగులుగా మిగిలిపోయారన్నారు. అభ్యర్థులకు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సమాజంలో ఎక్కువగా ఉండే కోర్సులను నేర్చుకోవటంతో పాటు ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. ఈ ఎంప్లాయిమెంట్ సెల్ ఒకే రోజు కాకుండా లాంగ్ టర్మ్ సమగ్రంగా ఏర్పాటు చేస్తామన్నారు. యువతీ యువకుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు త్వరలో కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఏలూరి

వేడుకలకు ముస్తాబైన ఏలూరి క్యాంప్ కార్యాలయం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

విజనరీ లీడర్, పర్చూరు నియోజ కవర్గ అభివృద్ధి ప్రదాత, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయం ముస్తా బయింది. ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి తన పుట్టినరోజును ఎలాంటి ఆడంబరాలు లేకుండా ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ పలు సేవా కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. వాడవాడలా సంబరాలు నిర్వహించేం దుకు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం వేదికగా జన్మదినోత్సవ వేడుకలను పలు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఏలూరి ఏర్పాట్లను పరిశీలించారు.

సేవా కార్యక్రమాలు: గుంటూరు అమరావతి హాస్పిటల్ సౌజన్యంతో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. నోవా అగ్రిటెక్, శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏలూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారు. 80 మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్ మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. ఏలూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, తెలుగు యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిం చనున్నారు. నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి, ఉద్యోగం కల్పించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక శ్రద్ధతో గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. దీనిని మంత్రులు అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించనున్నారు. ఏలూరి యూత్ ఫిట్నెస్ సెంటరును ప్రారంభిస్తారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా భారీ షామీయానాలు, ఎల్ఈడి స్క్రీన్లు, వాటర్ బాటిల్స్, భారీ ఎత్తున అన్నదానం ఏర్పాట్లు చేపడుతున్నారు.

పోలీస్ కవాతు రిహార్సల్స్ పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా : గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఎఆర్ డిఎస్‌పి పి.విజయసారధి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కవాతు రిహార్సల్స్ శనివారం నిర్వహించారు. ఈ రిహార్సల్స్‌ను ఎస్‌పి తుషార్ దూడి పరిశీలించారు. రిహార్సల్స్ అద్భుతంగా నిర్వహించారని సిబ్బందిని అభినందించారు. టైగర్, షాడో, బిట్టు, చెర్రీ పోలీస్ జాగిలాలతో ఆర్ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పెరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టైగర్ జాగిలం అతిథికి గౌరవ వందనం సమర్పించి బొకే ఇచ్చిన విధానం, షాడో జాగిలం వాసన ద్వారా వస్తువును కనిపెట్టిన విధానం, ఫైర్ జంప్ విన్యాసాలు నిర్వహించిన విధానం, బిట్టు జాగిలం పేలుడు పదార్థాలు ఉంచిన బాక్స్ గుర్తించిన విధానం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి టిపి.విఠలేశ్వర్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ జి. నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

27వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

నెల్లూరులో ఫిబ్రవరి1,2,3 తేదీల్లో నిర్వహిస్తున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు కోరారు. మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ మహాసభల్లో భాగంగా ఫిబ్రవరి 3న నిర్వహిస్తున్న మహాప్రదర్శన, బహిరంగ సభకు జిల్లా ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. నెల్లూరులో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఆరు నెలలు పూర్తయినప్పటికీ ఎన్నికల సమసయంలో ఇచ్చిన హామీలు అమలుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించకపోగా ప్రజలపై భారాలు మోపుతుందని విమర్శించారు. ఎన్నికల్లో విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా పోరాటాలు నిర్మించేందుకు మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జివి.కొండారెడ్డి,చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనిధి మేనేజర్ సులోచన

రుణాలు వసూలు చేయాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలో పొదుపు గ్రూపుల ద్వారా తీసుకున్న వివిధ రకాల రుణాలు సక్రమంగా చెల్లించేలా సభ్యులకు అవగాహన కల్పించి చెల్లించేలా చూడాలని ఇఓఎలకు శ్రీనిధి మేనేజర్ సులోచన తెలిపారు. స్థానిక మహిళా సమైక్య కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్కాపురం ఏరియా కోఆర్డినేటర్ ఓ సుధాకర్‌రావు, వెలుగు ఎపిఎం బి సుధాకర్‌రావు మాట్లాడుతూ శ్రీనిధి, ఉన్నతి, ఎఎస్‌విఇపి, హెచ్‌ఐడిఎఫ్ రుణాలు సక్రమంగా చెల్లించడం లేదని, వారి పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తీసుకున్న రుణాలు క్రమం తప్పకుండా చెల్లిస్తుంటే మరికొంతమందికి రుణాలు ఇచ్చే వెసులుబాటు ఉంటుందన్నారు. సమావేశాలకు విధిగా నివేధికలతో అందరూ హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఏపిఎం బి సుధాకర్‌రావు, మండల సమైక్య అధ్యక్షురాలు ఎంబాడి ఈశ్వరమ్మ, కమ్యూనిటి కోఆర్డినేటర్లు సాయిలు, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.



రాష్ట్ర అవార్డు తీసుకుంటున్న తహశీల్దార్ ఎం శ్రావణ్‌కుమార్

తహశీల్దారు శ్రావణ్‌కుమార్‌కు అవార్డు

ప్రజాశక్తి-దర్శి

ఎన్నికల నిమావళి నిబద్ధతతో పాటించినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్థానిక తహశీల్దార్ ఎం శ్రావణ్‌కుమార్‌కు రాష్ట్ర ఉత్తమ అవార్డును అందించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ విజయానంద్, రాష్ట్ర ఎన్నికల మాజీ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. ఆయనను పలువురు అభినందించారు.


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయవాది పి.సురేష్

సబ్‌జైలులో వసతుల పరిశీలన

ప్రజాశక్తి-దర్శి

లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది పరిటాల సురేష్ సబ్ జైల్‌లోని ఖైదీలకు అందుతున్న సేవలను గురించి శనివారం తెలుసుకున్నారు. పేదలకు అందుతున్న న్యాయ సహాయం, న్యాయ వాది లేని వారికి ఉచిత సహాయం, భోజనం గురించి తెలుసుకున్నారు. ఖైదీలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియ చేయాలని తెలిపారు. ఖైదీలు మంచిగా మారి కుటుంబానికి, సమాజానికి మేలు చేసే విధంగా సత్ ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. పేదలకు న్యాయ సహాయం అందించేందుకు లోక్ అదాలత్‌లతోపాటు మండల న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి న్యాయ సహాయం అందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. మంచి ప్రవర్తనతో మెలిగితే మీ కుటుంబాల తోపాటు సమాజం బాగుందని అన్నారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలి : కలెక్టర్

ఓటర్ల జాబితా నవీకరణలో పాల్గొన్న సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ వెంకటమురళి


జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1950 సంవత్సరం జనవరి 25న కేంద్ర ఎన్నికల సంఘ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 2011 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. భారత దేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పిలవబడుతుందన్నారు.ఓటు హక్కు ఉన్నవారందరిని ఓటర్లుగా నమోదు చేయడంలో, నవీకరించడంలో, ఎన్నికలు నిర్వహించడంలో అతిపెద్ద కార్యక్రమాన్ని ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తుందన్నారు. రెవెన్యూ శాఖ పై ఎన్నికల విధుల కార్యక్రమం చాలా పెద్ద బాధ్యతగా ఉందన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో నాయకులు ప్రజల్లో నుంచే వస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పాల్గొనే హక్కు, అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తీసుకునే నిర్ణయాలు, విధివిధానాలు, ప్రజల సంక్షేమం కోసమే పథకాలు అమలు చేస్తుందన్నారు. ఓటింగ్ ప్రక్రియ ప్రధానమన్నారు. ఈ మూడు సక్రమమైన పద్ధతిలో అమలు జరిగితే ప్రజాస్వామ్యం నిలుస్తుందన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి పి. గ్లోరియా మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును గురించి అవగాహన కల్పించి, ఓటు నమోదు చేయించాలన్నారు. అనంతరం ఓటర్ల జాబితా నవీకరణలో పాల్గొన్న సిబ్బందికి ప్రశంసా పత్రాలు, ,జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, డిబేట్ పోటీల్లోని విజేతలకు ప్రశంసా పత్రాలను, మెమోంటోలను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లు పేరం నాగేశ్వరరావు, పేరం వెంకటేశ్వర్లును జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహశీల్దారు సలీమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంతో సమానమని, ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని తహశీల్దార్ ఆవుల సురేష్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారు, దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అరుణ, ఆర్ఐ ఇనగంటి రాజశేఖర్, మాధవరెడ్డి, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, విఆర్ఓలు పి శ్రీనివాసులురెడ్డి, దిలీప్‌కుమార్, సుబ్బారెడ్డి, మందా రమేష్, ఉపాధ్యాయులు వై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దర్శి : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జాన్సన్, డిప్యూటి తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎన్నికల డిటి దేవప్రసాద్, ఆర్ఐ పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ బి రమాదేవి, విఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు : తహశీల్దార్ కార్యాలయం వద్ద నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్‌చార్జి తహశీల్దార్ ఇమ్మానియేల్ రాజు, ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి ఓటు హక్కు ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ జి సుబ్బయ్య పాల్గొన్నారు.

సిఎస్.పురం : ఓటర్ల దినోత్సవ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లకు సూచించారు. స్థానిక కెజిబివి పాఠశాల విద్యార్థులు ఓటర్ల దినోత్సవ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రేష్మ విద్యార్థినిల చేత ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


దర్శిలో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

'సూపర్ సిక్స్'.. సూపర్ ప్లాప్..

• డిసిసి అధ్యక్షులు షేక్ సైదా, జిల్లా ఇన్‌చార్జి సత్తేంద్ర బాబు • థాళి బజావ్ పేర కాంగ్రెస్ వినూత్న నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభించి 7 నెలలు దాటిన సూపర్ సిక్స్ పథకాలు అమలులో తీవ్రంగా వైఫల్యం చెందిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి గౌతు సత్తేంద్ర బాబు విమర్శించారు. కుంటి సాకులతో, మోసపు మాటలతో కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టడాన్ని నిరసిస్తూ డిసిసి ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద థాలి బజాబ్ పేర కాంగ్రెస్ నాయకులు వినూత్న రీతిలోకంచాలు మోగిస్తూ శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు సారథ్యంలోని ఎన్‌డిఎ కూటమి నాయకులు రాష్ట్ర ప్రజలకు తమ ప్రచారంలో వైకుంఠ స్వర్గం చూపించారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా చెప్పిన ఏ ఒక్క పథకాన్ని అమలు పరచకుండా మేన మేషాలు లెక్కించటం సమంజసం కాదని విమర్శించారు. తల్లికి వందనం, 20 లక్షల ఉద్యోగాలు, రూ.3000 నిరుద్యోగ భతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 20వేల రైతు భరోసా, మహిళలకి ప్రతి నెలా రూ.1500 బ్యాంక్ అకౌంట్ లో జమ లాంటి సంక్షేమ పథకాలు సూపర్ సిక్స్ పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల తరువాత వాటి ఊసే ఎత్తక పోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలా రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అసంఘటిత కార్మిక సంఘం అధ్యక్షుడు కైపు వెంకటకష్ణారెడ్డి, ఒంగోలు సమన్వయ కర్త, ఐవైసి కార్యదర్శి బిఆర్ఆర్.గౌస్ సంతనూతలపాడు సమన్వయకర్త పాలపర్తి విజేష్ రాజ్, ఉద్దండి మల్లికార్జునరావు, బొడ్డు సతీష్, ఉంగరాల శ్రీనివాసరావు, గోరంట్ల కోటేశ్వరరావు, సుదర్శన్ రవి, కాకర్లపూడి వేణు, ఏమని కోటేశ్వరరావు, దాసరి రవి, మార్కాపూర్ నాయకులు ఇమ్మానియేల్, వరప్రసాద్ బాబు, షేక్ బాషా, మహేష్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.


వినూత్నంగా కంచాలు మోగిస్తూ కాంగ్రెస్ నిరసన

భూముల రీ సర్వేకు గ్రామస్తులు సహకరించాలి

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

భూములు రీ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఇన్చార్జి తహశీల్దారు పి వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని కొండబోయినపల్లి గ్రామంలో చేపడుతున్న భూముల రి సర్వేపై గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. భూ యజమానులు తమకు సంబంధించిన భూ యాజమాన్య పత్రాలు సర్వే అధికారులకు అందజేసి సర్వే త్వరిత గతిన పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బ్రహ్మానందరెడ్డి, విఆర్ఒలు, సర్వేయర్లు, రైతులు ల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దారు వెంకటేశ్వర్లు


గంగవరం రైల్వే వంతెన వద్ద దట్టమైన పొగ మంచు

దట్టంగా పొగమంచు

ప్రజాశక్తి-దర్శి

దర్శి నుండి గంగవరం వెళ్లే రోడ్డులో రైల్వే ట్రాక్ వద్ద గల బ్రిడ్జి వద్ద దట్టమైన పొగ మంచు శనివారం ఉదయం 8గంటలకు పైగా పడటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. గత మూడు రోజులుగా పడుతున్న మంచు కంటే శనివారం అధికంగా మంచు పడటంతో ఉదయాన్నే వెళ్ళాలంటే వాహన చోదకులు భయపడుతున్నారు. ప్రమాదాలు జరుగుతాయనే భయంతో వేగాన్ని తగ్గించి వెళుతున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని ఇంటింటికీ చేర్చాలి

ప్రజాశక్తి-దర్శి

భారత రాజ్యాంగంలో ఆమోదం పొంది, అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఆ స్ఫూర్తి ఇంటింటికీ చేరవేయాల్సిన అవసరం ఉందని టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. రాజ్యాంగ వజ్రోత్సవ సందర్భంలో అది పౌరులందరి చేతిపుస్తకంగా మార్చినప్పుడే అనుకున్న లక్ష్యసాధనకు బాటలు పడతాయని అన్నారు. అదే స్ఫూర్తితో ప్రజాస్వామ్యం, పౌరహక్కుల పరిరక్షణ కేంద్రంగా రాష్ట్రంలో కూటమి పాలన కొనసాగుతోందని అన్నారు. గణతంత్ర దినోత్సవ శుభా కాంక్షలు తెలిపారు. అంబేద్కర్ రాసిన ఆ రాజ్యాంగం ఉండబట్టే నియంతలు, అరాచక శక్తులకు ఎదురొడ్డి ప్రజా స్వామ్యం మనగలుగుతోందని అన్నారు. గడిచిన అయిదేళ్లు రాష్ట్రంలో పరిస్థితులు అందుకు నిదర్శనంగా తెలిపారు.

అర్హులందరూ ఓటుహక్కు పొందాలి

ప్రజాశక్తి-అద్దంకి

18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి విజయ జ్యోతి కుమారి అన్నారు. శనివారం ప్రత్యేక ఓటర్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటు హక్కుతో తమ విలువను కాపాడుకోవాలన్నారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి అవగామన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సీనియర్ ఓటర్లకు ఘన సన్మానం చేశారు.

పర్చూరు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పర్చూరు తహశీల్దార్ బ్రహ్మయ్య కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయుల చేత శనివారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బాలికోన్నత పాఠశాలలో సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించి పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ మాధవి లత, బూత్ లెవెల్ అధికారులు యార్లగడ్డ శ్రీనివాసరావు, వై.గోవిందరెడ్డి, స్థానిక బాలికోన్నత పాఠశాల హెచ్ఎం అవని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్లలో మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో వెల్లటూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు టి.హేమ కుమార్, డి.యశ్వంత్ ఈ బహుమతులు సాధించినట్లు హెచ్ఎం అరుణ్ కుమారి తెలిపారు. ఈ బహుమతులను బాపట్ల జిల్లా కార్యాలయంలో కలెక్టర్ వెంకట మురళి చేతుల మీదుగా అందుకోవడం జరిగిందన్నారు. ఈ క్విజ్ కార్యక్రమంలో విజయం సాధించడానికి శిక్షణ ఇచ్చిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, సుభానిలను అభినందించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

ముండ్లమూరు: 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ కోరారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇద్దరు రైతులు కావూరి రామయ్య, మాలంపాటి చంద్రయ్యలను శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఓటు హక్కు ఎంతో పవిత్రమైనదన్నారు. ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీకాంత్, హెచ్ఎం మాధవి లత, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, వీఆర్వోలు తేజ, దేవా, పీఈటి భవన్నారాయణ, మహిళా పోలీస్ శాంతి ప్రియ, ఉపాధ్యాయులు ఆలీ, కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నగంజాం: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పట్ల పౌరులందరూ నిబద్ధత కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు.

రేపల్లె: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మహిత జూనియర్ కళాశాల విద్యార్థులచే శనివారం ర్యాలీని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి థియేటర్ సెంటరులో విద్యార్థులు ప్రతిజ్ఞ చేవారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పి.రాంబాబు, శానిటరీ ఇనిస్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎఇఆర్ఒగా గోపికృష్ణ

ప్రజాశక్తి-చీరాల : చీరాల నియోజకవర్గం ఉత్తమ సహాయక ఎలక్టోరల్ రోల్ అధికారిగా తహసీల్దార్ గోపికృష్ణ ఎంపికయ్యారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెంకట మురళి చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించి అవార్డు అందుకున్న తహశీల్దార్ గోపికృష్ణకు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న తహశీల్దారు గోపికృష్ణ

కర్లపాలెం నుంచి తహశీల్దారు సుందరమ్మ

కర్లపాలెం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బాపట్ల నియోజకవర్గంలో ఉత్తమ ఏఈఆర్‌వోగా కర్లపాలెం తహసీల్దార్ కెవిబిటి సుందరమ్మ, ఉత్తమ బీఎల్వోగా పాతనందాయపాలెం సచివాలయం విఆర్ఓ శివ నాగరాజులు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జె.వెంకట మురళి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అధికారులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న తహశీల్దారు సుందరమ్మ

వేమూరు నుంచి తహశీల్దారు సుశీల

వేమూరు: వేమూరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడంలో చాకచక్యంగా వ్యవహరించి పూర్తిచేసిన వేమూరు మండల తహశీల్దార్ సుశీలకు బెస్ట్ ఏఈఆర్ఓ అవార్డు లభించింది. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ఈమెకు శనివారం బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. తనకు ఈ అవార్డు దక్కటానికి కృషిచేసిన అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తనతోపాటు కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మరియు ఇరువురు బిఎల్‌వోలకు కూడా అవార్డు చెందుతుందని ఆమె తెలిపారు.


అవార్డు అందుకుంటున్న తహశీల్దారు సుశీల

పర్చూరు నుంచి తహశీల్దారు బ్రహ్మయ్య

పర్చూరు: పర్చూరు నియోజకవర్గానికి సంభందించి ఉత్తమ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పర్చూరు తహశీల్దార్ బ్రహ్మయ్య ఎంపికయ్యారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బాపట్లలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ మేరకు కలెక్టర్ వెంకట మురళి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఉత్తమ బూత్ లెవల్ అధికారులుగా పర్చూరు మండలం, వీరన్నపాలెం వీఆర్ఏ డి.కిరణ్ కుమార్, చిన్నగంజాం మండలం, పెదపల్లెపాలెం గ్రామానికి చెందిన మహిళా పోలీస్ ఎ.హిమబిందు ఎంపికయ్యారు. అవార్డులు పొందిన వారిని కార్యాలయ సిబ్బంది అభినందించారు.


అవార్డు అందుకుంటున్న తహశీల్దారు బ్రహ్మయ్య

నేడు సృజన సాహిత్య సమావేశం

ప్రజాశక్తి-అద్దంకి

శ్రీ కాళికాసమేత కమటేశ్వర స్వామివారి ఆలయంలో అల్లసాని పెద్దన కవితా వైభవం -మను చరిత్ర అను అంశంపై ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు సృజన సాహిత్య సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాటిబండ్ల శ్రీమన్నారాయణ ఈ సందర్భంగా మాట్లాడనున్నారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మేదరమెట్ల బ్రహ్మయ్యకి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం దేశభక్తి కవితలతో కూడినకవి సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

డిఎంహెచ్ఒ విజయమ్మ

ప్రజాశక్తి-నిజాంపట్నం

ప్రభుత్వ వైద్యశాలపై ప్రజల్లో నమ్మకం పెంచాలని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. మండలంలోని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శనివారం డీఎంహెచ్‌వో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేన్సర్ సర్వే, ఆయుష్మాన్ భారత్ సర్వే, గర్భవతుల సర్వీసెస్, ఆసుపత్రిలో డెలివరీలు తదితర కార్యక్రమాలు, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై మరింత నమ్మకం పెంచాలని చెప్పారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రిలో ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలు, మెరుగైన చికిత్సలు అందించాలని సూచించారు. విధుల పట్ల ఎవరైనా అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. డీఎంహెచ్ఓ వెంట వైద్యులు డాక్టర్ నాగార్జున, ఎంపీహెచ్ఈఓ, పీహెచ్ఎన్, వైద్య సిబ్బంది ఉన్నారు.


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యురాలు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశ-బాపట్ల

బాపట్ల వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ద్వారా చీరాల అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ సౌజన్యంతో కళాశాలలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూన రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంపట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో గైనకాలజిస్ట్ కావ్యరెడ్డి, ఎముకల వైద్యులు రంగనాథ్ రెడ్డి, దంత వైద్యులు సజిని, సాధారణ వైద్య నిపుణులు గోపి వర్మ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలోఎన్.ఎస్.ఎస్. అధికారులు కె.శ్రీనివాసులు, సి.సంధ్యారాణి, కె.విజయ్ ప్రకాష్, విజయ కుమార్, డా.ఏ.జే. సువర్ణలత పాల్గొన్నారు.

రాజ్యాంగానికి విధేయులై ఉండాలి

ప్రజాశక్తి-బాపట్ల

భారత రాజ్యాంగం ప్రజల ఆకాంక్షలకు ఒక ఆశాదీపంగా తరతరాలకు దారి చూపుతుందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూన రాణి అన్నారు. శనివారం రాజ్యాంగ 75 వసంతాల వేడుకలు ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం సమస్త సమస్యలకు పరిష్కారం అందిస్తుందన్నారు. అగ్రానోమి ఆచార్యులు ఎం.శ్రీరేఖ మాట్లాడుతూ విద్యార్థులు రాజ్యాంగ స్ఫూర్తి అలవారుచుకోవాలన్నారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను పరిరక్షించుకోవాలన్నారు. విద్యార్థులు రాజ్యాంగ పీఠికను పఠించి, ప్రతిజ్ఞ చేశారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సభలో తెలుగు కీర్తి జాతీయ పురస్కార గ్రహీత, రచయిత అడుసుమల్లి మల్లికార్జునను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అక్షయ్, చిత్రకారుడు జీవి, కరణం రవీంద్ర బాబు, సహదేవుడు, చినభూషణం పాల్గొన్నారు.


పెట్టుబడులే ధ్యేయంగా సిఎం దావోస్ పర్యటన

బుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు

ప్రజాశక్తి-బాపట్ల


సలగల రాజశేఖర్ బాబు

రాష్ట్రానికి ఉన్నతమై భవిష్యత్తును అందించాలనే పట్టుదలతో పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దావోస్ పర్యటన చేపట్టడం అభినందనీయమని బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు అన్నారు. శనివారం బాపట్లలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు నిద్రాహారాలు మాని లోకేష్ పుట్టినరోజు వేడుకలు కూడా జరుపుకోకుండా ఒక్క నిమిషం తీరిక లేకుండా పారిశ్రామికవేత్తలతో సమావేశమైన తీరు ప్రశంసనీయమన్నారు. పెట్టుబడులతో యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు కల్పనకు, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి ఈ పర్యటన ఎంతగానో దోహదపడుతుందన్నారు. తెలుగు దేశం పార్టీ కార్యకర్తగా, ఈ రాష్ట్ర పౌరుడిగా వారికి పాదాభివందనం చేస్తున్నానన్నారు. వారి కృషి ఫలితంగా కాగ్నిజెంట్ ఆర్గనైజేషన్, అపోలో టైర్స్, ఎన్విజన్ కంపెనీ, ఎకనామిక్ పార్టనర్ షిప్ వంటి కంపెనీలో రాష్ట్రంలో ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలకు లేదా ఏషియన్ కంట్రీస్‌కి ఎగుమతి చేసేందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 1000 కిలోమీటర్ల పొడవున ఉన్న సముద్రతీరంలో అనేక రకాల పరిశ్రమలకు ఉన్న అవకాశాలను తెలియజేయడమే గాక 2.2 మిలియన్స్ స్క్వేర్ ఫీట్ వర్క్ స్పేస్ అవకాశాలు ఉన్నట్లు పరిశ్రమకవేత్తలకు వివరించడం రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషికి నిదర్శనం అన్నారు. పరిశ్రమల స్థాపనకు రాష్ట్రం వైపు చూసేదానికి కొంతమందితో ఒప్పందాలు చేసుకుని త్వరలో అక్కడికి పెట్టుబడి తెచ్చేదానికి చేసిన కృషికి మనస్ఫూర్తిగా చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగితే 2030 నాటికి ఒక్క ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మార్కెట్లోనే 28.3 బిలియన్ మార్కెట్, బిలియన్ బిజినెస్ 8.3 బిలియన్స్ బిజినెస్ 2030 నాటికి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే సాధ్యమవుతుందనడంలో సందేహం లేదని సలగల ఈ సందర్భంగా పేర్కొన్నారు.


జాబితా విడుదల చేస్తున్న నిర్వాహకులు

స్కాలర్‌షిప్ టెస్టు మెరిట్ జాబితా విడుదల

ప్రజాశక్తి-అద్దంకి : విద్యోన్నతి ఫౌండేషన్ ద్వారా స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు ఈ నెల 5న నిర్వహించిన మెరిట్ పరీక్షలో శనివారం ప్రతిభావంతుల లిస్టును అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ కార్యాలయంలో విడుదల చేశారు. సెలెక్ట్ అయిన వారికి మొదటి సంవత్సరానికి గాను ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 15 మందికి ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాల వీరానారాయణ తెలిపారు. ధూళిపాళ్ల షర్మిల ప్రియాంక సౌజన్యంతో ఈ స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అద్దంకి పట్టణాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, రిటైర్డ్ సిండికేట్ బ్యాంకు మేనేజర్ మరియు బుద్ధిష్టి సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు బాబురావు, గాడిపర్తి రామాంజనేయులు, ఆంజనేయులు పాల్గొన్నారు.